క్లుప్తంగా

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోల్లో).. టమోటా రూ.17, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 37, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 18, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 19, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 23, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9(ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేటి నుంచి వినికిడి లోపం ఉన్న వారికి ఉచిత పరీక్షలు

రాంగోపాల్‌పేట్: వినికిడి, మాట్లాడటం, భాషా లోపాలు ఉన్న వారి కోసం మినిస్టర్ రోడ్డులోని హియర్ ఎన్ సే క్లినిక్‌లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. క్లినిక్ 9వ వార్షికోత్సవంలో భాగంగా ఫిబ్రవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. వినికిడి లోపం, బాల్య వికాస రుగ్మతలు ఉన్న పిల్లలను తీసుకురావచ్చన్నారు. ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియరల్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, కాంక్లియర్ ఇంప్లాంట్స్, హియరింగ్ ఎయిడ్స్ కోసం ఉచిత కన్సల్టేషన్ ఉంటుందన్నారు. వివరాలకు 9666699282 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న పాండుయాదవ్

కంటోన్మెంట్: పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ సంజీవనిలా ఉపయోగపడుతోందని బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ అన్నారు. బోయిన్‌పల్లి సీతారాంపూర్ శ్రీనివాసకాలనీకి చెందిన సావిత్రమ్మ కీళ్ల నొప్పులతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. వైద్య ఖర్చుల నిమిత్తం సాయం చేయాలని పాండుయాదవ్‌ను సంప్రదించగా, ఎమ్మెల్యే సాయన్న ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఆమెకు మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఐఆర్‌ఎంపీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంతోష్



సంతోష్‌ను అభినందిస్తున్న ఆర్‌ఎంపీఎస్ జాతీయ అధ్యక్షుడు సుశాంత్ పాండా

అడ్డగుట్ట: భారతీయ రైల్వే ఉద్యోగుల పాత పెన్షన్ పోరాట కమిటీ (ఐఆర్‌ఎంపీఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దక్షిణ మధ్య రైల్వేకి చెందిన ఇద్దనబోయిన సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం గుజరాత్‌లోని నడియాడ్‌లో జరిగిన ఐఆర్‌ఎంపీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం పోరాడతానని, త్వరలో అన్ని రాష్ట్రాల ఉద్యోగ సంఘాలను కలిసి సమన్వయంతో ముందుకు సాగుతామని చెప్పారు.

ఉచిత ఆక్యుపంక్చర్ నేచురోపతి వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

బౌద్ధనగర్: ఆక్యుపంక్చర్ నేచురోపతి వైద్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. శనివారం కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ నేచురోపతి హీలర్స్ గుజ్జేటి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుపంక్చర్ క్యాంప్ నిర్వహించారు. కార్పొరేటర్ కంది శైలజ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రజలు అనేక ఒత్తిళ్లకు లోనై అనారోగ్యానికి గురవుతున్నారని, సాధారణ మందులతో నయం కాని అనేక ఆరోగ్య సమస్యలు ఆక్యుపంక్చర్ చికిత్స విధానంతో నయం అవుతాయన్నారు. నెల రోజుల పాటు ప్రతీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు ఉచితంగా చికిత్స నిర్వహిస్తామని, పూర్తి వివరాల కోసం 9393950806 నంబర్లో సంప్రదించాలని హీలర్ గుజ్జేటి రామారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నరేష్ వంగపల్లి, అంజి వాల్మీమాస్, హీలర్స్ పార్వతి, అనురాధ, శాలిని, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే ప్రజలకు సేవ చేసే భాగ్యం

డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి



డిప్యూటీ మేయర్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

లాలాపేట: కార్పొరేటర్‌గా, డిప్యూటీ మేయర్‌గా మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం తార్నాకలోని క్యాంప్ కార్యాలయంలో ఆమెను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. రెండేళ్ల పదవీకాలంలో నగర ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించిందన్నారు. టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) ఆవిర్భావం నుంచి మొదలుకొని ప్రత్యేక రాష్ట్రం సాధించే వరకు సీఎం కేసీఆర్ వెంటే ఉన్నానన్నారు. తన ఉద్యమ నేపథ్యాన్ని గుర్తించి ఈ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు, కార్పొరేటర్‌గా గెలిపించిన తార్నాక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశానని, రానున్న మూడేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు. తార్నాక డివిజన్‌తో పాటు నగరంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, సొడగం నాగేశ్వర్‌రావు, చల్ల లక్ష్మారెడ్డి, ఆనంద్‌కుమార్, ఖాజా పాషా, యాకూబ్ షరీఫ్, అలీ, ఫయాజ్, నగేష్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి..

గ్రీన్ సిటీ ఆటో, టిప్పర్ డ్రైవర్ల అసోసియేషన్ బృందం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో శనివారం కలిశారు. పార్థీవాడ బస్తీలో చెత్త డంపింగ్‌యార్డు వద్ద స్థానికులకు, ఆటో డ్రైవర్ల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయని, పారిశుద్ధ్య కార్మికులపై స్థానికులు దాడులు చేస్తున్నారని ఆమెకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాంకీ సంస్థ ప్రతినిధి యమున, అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ



కృత్రిమ చేతులను అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: వివిధ కారణాలతో చేతులు కోల్పోయిన వారికి బ్యాటరీ సహాయంతో పనిచేసే కృత్రిమ చేయి ఎంతో సహాయకారిగా ఉంటుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రూ.18లక్షల కరూర్ వైశ్యా బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులతో పాటు రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, పూనా డౌన్‌టౌన్, ఇనాలి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మహబూబ్ కళాశాల ఆవరణలో దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదాల్లో చేతులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న సుమారు 120 మందికి కృత్రిమ అవయవాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారతదేశంలో తయారు చేసిన ఈ కృత్రిమ చేయి బ్యాటరీ సహాయంతో పనిచేస్తుందని, ఒక రోజు చార్జింగ్ చేస్తే రెండు రోజులు ఉపయోగించుకోవచ్చని చెప్పారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు రవి మాడభూషి, కార్యదర్శి ఏరుబండి మీర, డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేటర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కార్మికులకు పాదపూజ చేస్తున్న కార్పొరేటర్

పద్మారావునగర్: రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికను శనివారం ఓల్డ్‌బోయిగూడలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో బీజేపీ కార్పొరేటర్లు ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ల సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం భరిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. రెండేళ్ల కాలంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్ ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో డివిజన్ అభివృద్ధికి మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్యాం సుందర్ గౌడ్, చీర శ్రీకాంత్, ఎస్‌ఆర్ మల్లేష్, ఆకుల ప్రతాప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ..

బన్సీలాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్ ఆదయ్య స్మారక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శనివారం కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ రెండేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ చేసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, ఎస్‌ఆర్ మల్లేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు

సనత్‌నగర్: ఈ నెల 17 నుంచి 19 వరకు సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ఆవరణలోని శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 17న సామూహిక అభిషేకాలు, అంకురార్పణ, మహానివేదన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, 18న తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రుద్రాభిషేకాలు, సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10 గంటలకు సుజన రంజని వారిచే భక్తి సంగీత కార్యక్రమం (జాగరణ), రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలం సమయంలో మహా హారతి, తదుపరి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు. 19న ఉదయం రుద్రహోమం, పూర్ణాహుతి, నానావిధ ఫలాలతో రసాభిషేకం, సాయంత్రం 7.30 గంటలకు శివపార్వతుల ఊయల సేవ (పవళింపు సేవ) ఉంటాయన్నారు.

'ఓట్ల కోసమే 11 కులాలకు ఎస్టీ హోదా'

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం కేసీఆర్ ఓట్ల కోసమే 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం (ఏఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సొగబోయిన పాపారావు ఆరోపించారు. రాష్ట్రంలో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఓయూలో నిరసన వ్యక్తం చేశారు. పోడు భూముల హక్కు పత్రాలు ప్రభుత్వ భిక్ష కాదని ఆయన అన్నారు.

హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కాపీ అందిస్తున్న సమితి నాయకులు

పద్మారావునగర్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమితి తెలంగాణ అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ చానల్‌లో హమారా ప్రసాద్ అనే వ్యక్తి అంబేడ్కర్‌ను కించపరుస్తూ దళితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారన్నారు. ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, మహేందర్, మోహన్‌రావు, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిస్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

కంటోన్మెంట్: తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సహకారంతో బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో శ్రీపతి వెంకటరావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫిస్ట్ బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఫిస్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ జంపన ప్రతాప్ నిర్వాహకులు శ్రీపతి రఘు చరణ్‌తో కలిసి పోటీలను ప్రారంభించారు. అసోసియేషన్ సెక్రటరీ కొమ్ము వెంకట్ మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన ఫిస్ట్ బాల్‌కు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ నెల 17న నాగర్‌కోయిల్‌లో జాతీయ స్థాయి ఫిస్ట్ బాల్ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్‌గౌడ్, సత్యనారాయణ, స్టాన్లీ, మునిరాజ్, జగదీష్, విక్రమ్, విజయ్, వరప్రసాద్, పేరుక మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిస్ట్‌బాల్ జట్లతో నిర్వాహకులు

కారుతో ఉడాయించిన డ్రైవర్

కంటోన్మెంట్: డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి కారుతో ఉడాయించిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించిన వివరాల మేరకు.. ఓల్డ్‌బోయిన్‌పల్లిలో నివాసముండే రాకేశ్ సంచారపురిలో ఓ ఫైనాన్స్ సంస్థ నిర్వహిస్తున్నాడు. గత డిసెంబర్‌లో ఉపేందర్ (23) అనే వ్యక్తి వీరి వద్ద డ్రైవర్‌గా చేరాడు. గత నెల 17న రాకేశ్ అనారోగ్యానికి గురికావడంతో అతడిని కారులో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో ఉపేందర్ కారు తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన బైకును సైతం తనఖా పెట్టినట్లు గుర్తించిన రాకేశ్ తల్లి అనూరాధ, కారు తీసుకుని రావాలని ఉపేందర్‌ను కోరినా స్పందించడం లేదు. అనూరాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపగ్రహం తయారీలో విద్యార్థినుల భాగస్వామ్యం



ప్రాజెక్టులో భాగస్వాములైన విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 11వ తేదీన ఎస్ఎస్ఎల్వీ–డీ2 ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన ఆజాదీశాట్ డీ2 ఉపగ్రహం తయారీలో సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు భాగస్వాములయ్యారు. స్పేస్ కిడ్స్ సంస్థ దేశ వ్యాప్తంగా 75 స్కూళ్లకు చెందిన 760 మంది విద్యార్థినులను ఈ ఉపగ్రహం తయారీలో భాగస్వాములను చేసింది. ఇందులో భాగంగా సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ గ్రేసీ విద్యార్థులను, వారికి నేతృత్వం వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు శాటిలైట్ తయారీలో భాగస్వాములు కావడంతో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచుకున్నారని, భవిష్యత్‌లో స్పేస్ సైంటిస్టులు కావాలనే ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

కంటోన్మెంట్: ఓల్డ్ సిటీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మూసా సిద్దిఖీని హత్య చేసిన కేసులో నిందితులు ఫయాజుద్దీన్, అతడి కుమారుడు వాహిద్‌ను బోయిన్‌పల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తలెత్తిన విభేదాలను పరిష్కరించుకునేందుకు మూసా సిద్దిఖీ గత గురువారం దిల్‌కుష్‌నగర్‌లోని ఫయాజుద్దీన్ ఇంటికెళ్లాడు. ఆ సమయంలో ఫయాజుద్దీన్, మూసా సిద్దిఖీపై దాడి చేసి చంపిన విషయం తెలిసిందే. నిందితులను అదుపులోకి తీసుకుని రెండు రోజుల పాటు విచారించిన పోలీసులు శనివారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

శ్రీనివాసుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆలయ ప్రతినిధులు

చిలకలగూడ: నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బింగు వెంకటసాయికుమార్, బిట్ల రఘునందన్, శశాంక్, సంజన, మధు, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రసూల్‌పురా: యువతకు క్రీడల్లో నైపుణ్యం లేకపోవడంతోనే అంతర్జాతీయ స్థాయిలో సరైన విజయాలు సాధించలేని పరిస్థితి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో రెండు రోజుల పాటు కొనసాగిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని క్రీడల్లో మరింత నైపుణ్యత ఉన్నట్లయితే ప్రపంచ స్థాయిలో మంచి విజయాలు సాధించవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు క్రీడల్లో సరైన శిక్షణ అందిస్తే మంచిగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఖోఖో, కబడ్డీ, షాట్‌పుట్, అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వికాష్ పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు నరేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శివరామకృష్ణ, దక్షిణ ప్రాంత అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి'



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్, టీఎమ్మార్పీఎస్ నాయకులు

రసూల్‌పురా: నూతన సచివాలయం గుమ్మటాలను కూల్చివేస్తామని చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్, టీఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసూల్‌పురాలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం టీఎమ్మార్పీఎస్ నేతలు, దళిత సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బండి సంజయ్ ప్రధాని మోదీని ఒప్పించి నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టించాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కంటోన్మెంట్‌లో బీజేపీ నేతలను తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇటుక గోపి, ప్రభాకర్, పొన్నాల బాబు, ధన్‌రాజు, బిల్లం మహేందర్, ప్రవీణ్, మహేష్, సురేష్, భాస్కర్, కాంతారవు, మల్లేష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ రహదారి దిగ్బంధం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధం చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇటుక శ్రీకిషన్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి పికెట్ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా బిల్లు పెట్టలేదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు జాతీయ రహదారిని దిగ్బంధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు రొట్టెల సునీల్‌మాదిగ, మంద మధుకర్, అజిత్‌కల్యాణ్, బేగరి నరసింహ, కాంపల్లి శ్రీకాంత్ మాదిగ, విష్ణుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మంచి పేరు తీసుకురావాలి



రాజశేఖర్ రెడ్డితో మార్కెట్ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: దేశంలోనే పేరు కలిగిన బోయిన్‌పల్లి మార్కెట్‌కు మరింత మంచి పేరు తేవాలని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సభ్యులు శనివారం బోయిన్‌పల్లిలోని సౌజన్య కాలనీలో మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని, వ్యవసాయ రంగంతో పాటు మార్కెటింగ్ శాఖకు ఆయన అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నగరంలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ అయిన బోయిన్‌పల్లి మార్కెట్ గత ఎనిమిదేళ్లలో పలు మైలురాళ్లను అధిగమించిందన్నారు. నూతన పాలకమండలి సభ్యులు రైతులు, వ్యాపారులు, హమాలీల ప్రయోజనాలను పరిరక్షించేలా పనిచేయాలని సూచించారు. రాజశేఖర్ రెడ్డిని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు దేవులపల్లి శ్రీనివాస్, రామకృష్ణ, మీనాభాస్కర్, భాస్కర్‌ముదిరాజ్, నారాయణ, జవహర్‌లాల్, ప్రభాకర్, షేక్ నయీమ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాశ్, ఆనంద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మడ్‌ఫోర్ట్ బస్తీలో తాగునీటి పైపులైన్ పనులకు బోర్డు ఆమోదం



నూతనంగా నిర్మించిన టాయిలెట్‌లు ప్రారంభిస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మడ్‌ఫోర్ట్ బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కంటోన్మెంట్ బోర్డు ముందుకొచ్చింది. ఎమ్మెల్యే సాయన్న ఇచ్చిన రూ.3 లక్షలతో పాటు అదనపు నిధులతో తాగునీటి సదుపాయం కల్పించేందుకు బోర్డు సమావేశంలో తీర్మానం చేశారు. 35 ఏళ్ల క్రితం వెలిసిన మడ్‌ఫోర్ట్ బస్తీకి నాలుగేళ్ల క్రితం వరకు విద్యుత్ సదుపాయం లేదు. రక్షణ శాఖ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారనే కారణంతో బోర్డు అధికారులు ఇక్కడ ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. వారికి బోర్డు ఎన్నికల్లో ఓట్లు సైతం తొలగించారు. అయితే బస్తీ వాసుల విన్నపం మేరకు ఎమ్మెల్యే సాయన్న ఇటీవలే తాగునీటి కోసం బోర్ వేయించడంతో పాటు ఇతర సదుపాయాల కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.3 లక్షలు కేటాయించారు. బోర్డు అధికారులు సైతం స్పందించి బస్తీలో పూర్తి స్థాయిలో తాగునీటి పైపులైన్ వేసేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను శుక్రవారం శ్రీగణేశ్ ప్రారంభించారు. అదే రోజు మడ్‌ఫోర్ట్ బస్తీలో తాగునీటి పైప్‌లైన్ కోసం బోర్డు తీర్మానం చేయడం పట్ల శ్రీగణేశ్ సంతోషం వ్యక్తం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

రసూల్‌పురా: పద్మశ్రీ డాక్టర్ హన్మంతరావు నేతృత్వంలో కొనసాగుతున్న స్వీకార్ ఉప్‌కార్ రీహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలోని ఉన్నతి వినికిడి దివ్యాంగుల జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం పద్మశాలి కల్యాణ మండపంలో శనివారం సందడిగా సాగింది. దేశ విదేశాల్లోని వివిధ సంస్థల్లో స్థిరపడిన వెయ్యి మంది ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా స్వీకార్ ఉప్‌కార్ రిహాబిలిటేషన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ పి.నిర్మలారావును ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



నిర్మలారావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు